

పలమనేరులో పారిశ్రామికాభివృద్ధి

పలమనేరులో పారిశ్రామికాభివృద్ధి పరుగులు తీసేలా ప్రభుత్వ యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టింది. - 8లో



కల్పవృక్షంపై కోదండరాముడు

తవణంపల్లె మండలం టి.పుత్తూరులో సోమవారం కోదండరాముడు కల్పవృక్ష వాహనంపై విహరించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	25
తిరుపతి	32	25
తిరుమల	28	22
గూడూరు	35	27
నగరి	33	26

న్యూస్‌రీల్

నేడు ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

చిత్తూరు రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు.

స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: స్పందనలో ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులపై ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయొద్దని చిత్తూరు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం చిత్తూరులోని ఆర్మ్‌డు రిజర్వు పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 17 ఫిర్యాదులు రాగా ఇందులో ఇంటి తగదాలు 2, చీటింగ్ 3, కుటుంబ తగదాలు 4, వేధింపులు 1, ఆస్తి తగదాలు 2, భూ తగదాలు 5 చొప్పున అందాయి. అనంతరం జిల్లాలోని పోలీసు స్టేషన్ల అధికారులతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. స్పందనలో ప్రతీ వారం వచ్చే ఫిర్యాదుల స్థితిపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

రూ.10.56 కోట్లు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేశారని డీపీఓ లక్ష్మి తెలిపారు. జిల్లాకు మొదటి విడతలో భాగంగా రూ.10.56 కోట్లు కేటాయించారన్నారు. వీటిని గ్రామ పంచాయతీ ఖాతాలకు జమ చేస్తున్నారని తెలిపారు. వీటిని గ్రామాభివృద్ధి కోసం వినియోగిస్తారని వివరించారు.

పక్కాగా జీఈఆర్ సర్వే



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే)ని పకడ్బందీగా చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. పలు శాఖల జిల్లా అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు ఉన్న పిల్లలు ఏదో ఒక పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. ఈనెల 15 వ తేదీకల్లా జీఈఆర్ సర్వేని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8200 మంది బడిబయట పిల్లలున్నట్లు తెలిపారు. వారందరినీ తప్పనిసరిగా బడుల్లో చేర్పించాలన్నారు. రొంపిచెర్ల, పాలసముద్రం, కార్వేటినగరం మండలాల్లో 100 శాతం సర్వే చేశారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన మండలాల్లో సర్వేని ఈ నెల 15 లోపు పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సురక్ష క్యాంపులు



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష క్యాంపులను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల జిల్లా అధికారులతో, క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపడుతున్న స్పందన, జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పురోగతిని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయకుమార్ రెడ్డి, శంకర్‌బాబు, పద్మనాభం, గంగాభవాని , మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న 'సేవా సైన్యం'

రాజకీయాల్లో నేతలకు పరిణితి ఉండాలి.. సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా కార్యాచరణ పాటించాలి.. ప్రజా సమస్యలను పూర్తిస్థాయి అవగాహనతో ప్రస్తావించగలగాలి.. విమర్శలు చేసేముందు వాస్తవాలను తెలుసుకోవాలి.. నైతిక విలువకు కట్టుబడి ఆరోపణలు గుప్పించాలి.. అయితే కొందరు పదవుల కోసమే పాలిటిక్స్‌లోకి వస్తున్నారు.. ఉనికిని కాపాడుకునేందుకు దిగజారి ప్రవర్తిస్తున్నారు.. ఇందుకు తాజాగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలే నిదర్శనమని పలువురు మేధావులు వెల్లడిస్తున్నారు. ప్రభుత్వానికి.. ప్రజలకు నడుమ వారధులుగా సేవలందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని ఎమ్మెల్యేలు, నేతలు మండిపడుతున్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న తమను అవమానించడంపై సేవా సైనికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పవన్ కల్యాణ్ ఆరోపణలపై వలంటీర్ల ఆగ్రహం
- అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్
- సంక్షేమ వారధులకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యేలు, నేతలు, ప్రజాసంఘాలు
- జనసేన అధినేతకు రాజకీయ సమాధి తప్పదని హెచ్చరిక



పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారం నిర్వహిస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



రాపూరు : సిద్ధవరంలో పవన్ దిష్టిబొమ్మ దహనం

తిరుపతి మంగళం/చిత్తూరు కార్పొరేషన్/బంగారుపాళెం/సైదాపురం/బైరెడ్డిపల్లె : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం రాత్రి ఏలూరులో నిర్వహించిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలను వలంటీర్లతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రజా సంఘాల వారు తీవ్రంగా ఖండించారు. వలంటీర్లపై ఆరోపణలు చేస్తే పవన్‌కు రాజకీయ సమాధి తప్పదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల పాలనతో పింఛన్ తీసుకోవాలంటే వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలో ఉండాల్సి వచ్చేదని, వలంటీర్ వ్యవస్థ వచ్చిన తర్వాతే వారి ఇక్కట్లు తప్పాయని వెల్లడించారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను చేరుకున్న వలంటీర్లను అమ్మాయిలను అపహరించే ముఠాగా పేర్కొనడమంటే ప్రజావ్యవస్థనే అవమానించినట్లని వివరిస్తున్నారు.

ప్రజాస్వామ్యానికే అవమానం



ప్రతి నెలా ఒకటో తేదీనే సామాజిక పింఛన్లు పంపిణీ చేసే వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. జనరంజకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడమంటే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే. పవన్ కల్యాణ్‌కు ఉన్న రాజనీతి, రాజకీయ పరిణితి కోడి బుర్రతో సమానం. ప్రజా సేవకులపై నోటికొచ్చినట్లు మాట్లాడితే పవన్ కల్యాణ్‌కు రాజకీయ సమాధి తప్పదు.

– భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్యే, తిరుపతి

నిందలేస్తే మూల్యం తప్పదు



ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ నిందలేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. కోవిడ్ సమయంలో వైరస్ సోకిన వారి ఇళ్లకు వెళ్లి మరీ వలంటీర్లు సేవ చేసి, ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఇదే విధంగా మాట్లాడితే పవన్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

– ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, చిత్తూరు

పవన్‌కు అస్సలు అర్హత లేదు



జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు వలంటీర్ల గురించి మాట్లాడే అర్హత అస్సలు లేదు. ప్రజా సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చారు. ఆ మేరకే వారు సైతం చిత్తశుద్ధితో సేవలందిస్తున్నారు. జనం కోసం పనిచేస్తున్న వలంటీర్లపై ఇష్టారాజ్యంగా మాట్లాడడం సబబు కాదు. ఇలా తప్పుడు ఆరోపణలు చేయడం సమాజానికి కూడా మంచిది కాదు.

– ఎంఎస్ బాబు, ఎమ్మెల్యే, పూతలపట్టు

విశిష్ట సేవలపై విషం



రాష్ట్రంలో విశిష్ట సేవలందిస్తున్న వలంటీర్లపై విషం కక్కడం భావ్యం కాదు. వెంటనే పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి. ప్రాణాలను కూడా లెక్కచేయకుండా కోవిడ్ సమయంలో వలంటీర్లు 16 వేల కోట్ల మాస్క్‌లు అందించారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న పవన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు.

– కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే, సత్యవేడు

ఇది చంద్రబాబు స్క్రిప్ట్



చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే పవన్ కల్యాణ్ మాట్లాడుతున్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని తెలుసుకోవాలి. మహిళలపై పవన్‌కు ఎప్పుడూ గౌరవం లేదు. నిత్యం జనంతో మమేకమై సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరుస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. దీనిపై వలంటీర్లకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న వారిని దూషించడం మానుకోవాలి.

– ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్



నగరి మండలం ఓజీ కుప్పంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు



రాష్ట్రంలో ఒంటరి మహిళలు, వలంటీర్లను కించపరుస్తూ పవన్ కల్యాణ్ మాట్లాడడం సిగ్గు చేటు. ప్రతి నెలా ఒకటో తేదీనే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్న వలంటీర్లంటే అవ్వాతాతలకు సైతం ఎంతో అభిమానం. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటే చేరుస్తున్న సైనికులు వలంటీర్లు. వారిని కించపరిచేలా వ్యాఖ్యానించడం దారుణం.

– మొగసాల రెడ్డెమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్, చిత్తూరు

నోరు అదుపులో పెట్టుకోవాలి



దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలి. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ విశేషంగా సేవలందించే వలంటీర్లను దూషిస్తే ఎవరూ హర్షించరు. ఇప్పటికైన పవన్ తన ప్రవర్తన మార్చుకుని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి. లేకుంటే జనమే ఆయనపై తిరుగుబాటు చేస్తారు.

– చిన్నబ్బు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు, చిత్తూరు

ఇంట్లో మనిషిలా చూస్తున్నారు



నాలుగేళ్లుగా వలంటీర్‌గా పనిచేస్తున్నా. నా పరిధిలోని ప్రతి ఒక్కరూ నన్ను తమ ఇంట్లో మనిషిలానే చూస్తున్నారు. పథకాలపై ఎలాంటి సందేహం వచ్చినా వెంటనే ఫోన్ చేస్తున్నారు. మాకు ప్రభుత్వం అందిస్తున వేతనం కంటే ప్రజలు ఇస్తున్న మర్యాదే ఎక్కువ. సంక్షేమ ఫలాలను వారికి అందించినప్పుడు కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. అలాంటిది మామీద పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేయడం అన్యాయం. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలి.

– లక్ష్మి, వలంటీర్, చిత్తూరు

కేంద్ర పథకం కోసం సర్వే



కోవిడ్ సమయంలో కుటుంబసభ్యులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయిన మహిళలను ఆదుకునేందుక కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. వారి కోసం క్షేత్రస్థాయిలో సర్వే చేశాం. అయితే సర్వేలో లబ్ధిదారుల వ్యక్తిగత విషయాలను ఆరా తీయలేదు. హ్యూమన్ ట్రాఫికింగ్ అంటూ కేంద్ర నిఘా సంస్థ చెప్పిందంటూ పవన్ అసత్యాలు మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న మాపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదు.

– చాముండేశ్వరి, వలంటీర్, చిత్తూరు



తిరుపతిలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న జేసీఎస్ నేతలు



నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద వలంటీర్ల నిరసన



నారాయణవనంలో పవన్ కల్యాణ్ ఫొటోను దహనం చేస్తున్న వలంటీర్లు, నేతలు

సంపద సృష్టి కర్త సీఎం జగన్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

- సంపదను హరించింది బాబు
- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి
- పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

వెదురుకుప్పం: అప్పటి సీఎం చంద్రబాబు సంపదను హరిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంపదను సృష్టిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కొనియాడారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో ఊహించిన స్థాయిలో అభివృద్ధికి బాటలు వేసినట్లు గుర్తు చేశారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు పేదల గురించి పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. బాబును సీఎం చేసే ప్యాకేజీ వస్తోందని పవన్ తహతహలాడుతున్నట్లు చెప్పారు. వీరిద్దరికీ పేదల సంక్షేమం పట్టదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య పాల్గొన్నారు.

పార్టీలో చేరిన టీడీపీ నేతలు

టీడీపీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వెదురుకుప్పంలో సోమవారం జరిగిన సభ అనంతరం వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యులు రాధిక పురంధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జ్ఞాన కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్‌లు నీరజరాధాక్రిష్ణారెడ్డి(వెదురుకుప్పం), వెంకటేశ్(గొడుగుచింత), నాయకులు కుమార్, శేఖర్ రెడ్డి, వాసుతో పాటు సీఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన 20 మంది యువత ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాంగ్ పోస్ట్

- జిల్లా తపాలాశాఖ ఉద్యోగాల్లో అక్రమాలు
- తప్పుడు సర్టిఫికెట్లతో ఏబీపీఎం పోస్టులు
- ఇద్దరిని ఉద్యోగాల నుంచి తొలగించిన ఎస్పీ

చిత్తూరు అర్బన్: అసలే కేంద్ర సంస్థ ఉద్యోగాలు. ఒక్కసారి లోపలకు వెళ్లిపోతే తిరుగులేదనుకున్నారు. ఇందుకోసం తప్పుడు మార్గాన్ని ఎంచుకుని నకలీ సర్టిఫికేట్లతో ఉద్యోగాల్లో చేరిపోయారు. తీరా అసలు విషయం బయటపడడంతో ఉద్యోగాలు పోగొట్టుకుని క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. చిత్తూరులోని జిల్లా తపాలాశాఖ వెలుగుచూసిన ఈ ఘటనలో డూప్లికేటుగాళ్లు ఎందరు ఉన్నారో అంటూ పోలీసుశాఖ, తపాలాశాఖ జల్లెడపడుతోంది. చిత్తూరు జిల్లాలోని పలు ఉప తపాలాశాఖ కార్యాలయాల్లో గ్రామీణ్ డాక్ సేవ (జీడీఎస్) విభాగంలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (ఏబీపీఎం) పోస్టుల భర్తీకి 2021లో ఢిల్లీలోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయం నుంచి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 2,296 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో పదో తరగతి విద్యార్హతతో భర్తీ చేసే ఏబీపీఎం, జీడీఎస్ పోస్టులకు వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి షార్ట్‌లిస్ట్ ప్రకారం గతేడాది చిత్తూరులోని తపాలాశాఖ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లు ఒరిజినల్స్‌ను అధికారులకు అందజేశారు. ఇలా చిత్తూరు (ఉత్తరం, దక్షిణం) తోపాటు పుంగనూరు, మదనపల్లె, పలమనేరు సబ్ డివిజన్ల నుంచి ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల మార్కుల ఆధారంగా గతేడాది ఉద్యోగాలు వచ్చాయి. అయితే అభ్యర్థుల నుంచి సేకరించిన మార్కుల జాబితాను తనిఖీ చేయడానికి ఉన్నతాధికారులు రాష్ట్ర ఎస్ఎస్‌సీ బోర్డుకు పంపించారు. ఇందులో ఇద్దరు అభ్యర్థులు లామినేషన్ చేసిన మార్కుల జాబితా ఉండడంతో.. ఇది కలర్‌ప్రింట్ అని, ఒరిజినల్‌ను మళ్లీ పంపాలని ఎస్ఎస్‌సీ బోర్డు ఆ రెండు మార్కుల జాబితాలను వెనక్కు పంపింది. పత్రాంపల్లె, పూతలపట్టుకు చెందిన ఇద్దరు అభ్యర్థులను గతనెల పిలిపించిన అధికారులు, ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని అడిగితే నీళ్లు నమిలి అసలు విషయం ఒప్పుకున్నారు. సర్టిఫికెట్లను కలర్ జిరాక్స్ తీయించి, ఇందులో మార్కులను వందకు వందగా వేసినట్లు అంగీకరించడంతో ఇద్దరిని విధుల నుంచి తొలగించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన మురగేషన్

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు, తిరుచానూరు శేషాద్రి నగర్ సమీపంలోని పాడిపేట హౌసింగ్ కాలనీలో నివాసముంటున్న మురగేషన్(45) తిరుపతిలోని అపూర్వ టెక్స్‌టైల్స్‌లో పనిచేస్తున్నాడు. పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం వైపు వెళుతుండగా వెదురుగా మామిడి కాయల లోడ్డుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిని అతడ్ని ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రెండు వర్గాలపై కేసు నమోదు

సోమల: మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురంలో ఘర్షణ పడిన రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నగేష్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు సరస్వతీపురం వద్ద గల మామిడి తోట స్థలం వివాదంపై మొదటి వర్గం వారైన బుచ్చిరెడ్డి, సుకుమార్ రెడ్డి, రెండవ వర్గం వారైన షామీర్, ఇమ్రాన్, ఖాదర్ వల్లీ, అబ్దుల్ సలాం, అస్మత్‌బీలు ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తాళాలు పగలగొట్టి నగలు చోరీ

పుంగనూరు: ఇంటి తాళాలు పగులగొట్టి సుమారు రూ.లక్ష విలువ చేసే బంగారు, వెండి నగలు చోరీ చేసిన సంఘటన సోమవారం పట్టణంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని కోర్టువీధిలోని షిరిడి సాయినగర్‌లో మంజుల, మహేంద్ర దంపతులు సొంత పనులపై ఆదివారం ఉదయం బెంగళూరుకు వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటి వద్దకు రాగా చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో ఉన్న సుమారు 100 గ్రాముల బంగారు నగలు, ఒక కిలో వెండి వస్తువులు, టీవీని చోరీ చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మోహన్‌కుమార్ సంఘటన స్థలాన్ని సందర్శించి, చిత్తూరు నుంచి క్లూస్‌టీమ్‌ను పిలిపించి, వేలి ముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలమనేరులో పారిశ్రామికాభివృద్ధి జోరు

- ఔత్సాహిక ప్రారిశ్రామికవేత్తలకు అన్ని సదుపాయాలు
- బినామీలకు బ్యాంకులో దక్కని రుణాలు

ఫ్యాక్ట్ చెక్

పలమనేరు: పలమనేరు సమీపంలోని ఏపీఐఐసీ స్థలాల్లో ఎంఎస్ఎంఈ(మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)లలో పరిశ్రమల నిర్మాణాలు జోరందుకున్నాయి. ఔత్సాహిక ప్రారిశ్రామికవేత్తలు రకరకాల పరిశ్రమలను ఇక్కడ ప్రారంభించి పలువురికి ఉపాధిని కల్పిస్తున్నారు. ఇక్కడి పారిశ్రామికవాడలో ఏపీఐఐసీ ద్వారా రూ.4 కోట్లతో అవసరమైన సదుపాయాలను కల్పించారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం అందలేదంటూ ఈనాడు ఊదరగొట్టింది. వాస్తవంగా పలమనేరు ఏపీఐఐసీ ఎంఎస్ఎంఈలో ఈ మూడేళ్లలో రూ.4కోట్లతో మౌళిక సదుపాయాలు సమకూర్చారు. ఈ పారిశ్రామిక వాడలో బీటీ రోడ్లు, డ్రైన్లు, విద్యుదీకరణను అత్యంత వేగంగా ఏర్పాటు చేశారు. ఆటో నగర్‌లో 294మందికి, ఎంఎస్ఎంఈ ద్వారా 42మందికి స్థలాలను కేటాయించారు. ఇందులో 80 శాతం మంది ఇక్కడ నిర్మాణాలను చక్కగా చేపడుతున్నారు.

ఎన్‌వోసీలు ఇవ్వడం లేదని, తద్వారా రుణాలు అందకుండా పారిశ్రామిక వేత్తలు పారిపోతున్నారని ఈనాడు ఆరోపణలు చేసింది. నిబంధనల మేరకు డీపీఆర్‌లు సమర్పించి పరిశ్రమలను నడుపుతున్న వారికి ఎన్‌వోసీలు ఠంఛనుగా అందుతున్నాయి. బ్యాంకులో రుణాలు దక్కుతున్నాయి. అయితే గతంలో పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ్‌రెడ్డి హయాంలో ఇక్కడ తప్పుడు డీపీఆర్‌తో పరిశ్రమలను దక్కించుకున్న ఆయన అనుచరులు, వాటిని ఇతరులకు అగ్రిమెంట్ల ద్వారా విక్రయించుకున్నారు. దీంతో వారికి ఎన్‌ఓసీ, రుణం మంజూరులో సమస్యలు ఎదురవుతున్నాయి. నిజాయితీగా స్థలాలు తీసుకుని పరిశ్రమలు తీసుకున్న వారికి అన్ని రకాల సదుపాయాలు సకాలంలో అందుతున్నాయి.

ఇక్కడి పారిశ్రామిక వాడలో లైజాన్ ఆఫీసర్ కార్యాలయం ఎప్పుడూ మూతపడే ఉంటుందని ఈనాడు రాసుకొచ్చింది. అయి తే వారానికి రెండు రోజులు మాత్రమే లైజన్ ఆఫీసర్ ఇక్కడ అందుబాటులో ఉండేలా నిబంధనలున్నాయి. ఆ నిబంధనల ప్రకారం వారంలో రెండు రోజులు ఆయన అందుబాటులో ఉంటారు.

అసలు ఏం జరిగిందంటే..

పట్టణ సమీపంలోని పారిశ్రామికవాడలో ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమలకు స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్థలాల కేటాయింపులు గత టీడీపీ ప్రభుత్వంలో జరిగాయి. ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ పచ్చనేతల సిఫారసులున్నవారందరికీ ఇక్కడ స్థలాలను కేటాయించింది. ఇందులో భాగంగా ఇక్కడ 30 మందికిపైగా కేవలం స్థలాలను దక్కించుకునేందుకు ఏదో ఒక ప్రాజెక్టు రిపోర్టును అందజేసి ఏపీఐఐసీని నమ్మించారు. మరికొందరు సంబంధిత ప్రాజెక్టును చేపట్టకుండా తమకు కేటాయించిన స్థలాలను లీజులకు ఇచ్చేశారు. అలాంటి వారికి ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి.


పరిశ్రమల వాడలో ఏపీఐఐసీ నిర్మించిన రోడ్లు, డ్రైన్లు, కరెంట్ సౌకర్యాలు


ఇటీవల నూతనంగా నిర్మించిన పవన్ ఎంపవర్ సొల్యుషన్ ప్రాజెక్టు

అన్ని సదుపాయాలూ అందుబాటులోనే..



నేను ఏపీఐఐసీ ద్వారా సోలార్ పరిశ్రమ కోసం పవన్ ఎంపవర్ సొల్యూషన్స్ పేరిట11 సెంట్ల స్థలం పొందాను. అందులో డీపీఆర్ మేరకు బిల్డింగ్ నిర్మించా. ఇందుకు ఎన్‌వోసీ వచ్చింది. దీంతో బ్యాంకులో రుణంతీసుకున్నా. మా కై తే ఇక్కడ ఎటువంటీ ఇబ్బంది లేదు. ఏపీఐఐసీ అధికారులు ఎస్టేట్‌లో మౌళిక సదుపాయాలను చక్కగా కల్పించారు.

– పవన్, ఔత్సాహిక పారిశ్రామిక వేత్త, పలమనేరు

అడిగిన వెంటనే ఎన్‌వోసీలు



పలమనేరు పారిశ్రామికవాడలో నిభందనలు మేరకు అడిగిన 48 గంటల్లో ఎన్‌వోసీలిస్తున్నాం. మోర్టిగేజ్ నిభందనలు ఉన్నవారికి బ్యాంకుల్లో రుణాలందుతున్నాయి. ఎవరిదో ఎంవోయూను బినామీలు వచ్చి రుణాలు కావాలంటే బ్యాంకులు రుణాలిస్తారా. ఎస్టేట్‌లో అన్ని మౌళిక సదుపాయాలను కల్పించాం. ఇక్కడ చక్కగా పరిశ్రమలు రన్ అవుతున్నాయి. కొందరు పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. విషయం తెలియకుండా పత్రికల్లో కథనాలు రాస్తే అట్టివారిపై చర్యలు తప్పవు.

– సుహానాసోనీ, జెడ్‌ఎం, ఏపీఐఐసీ, చిత్తూరు



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,420
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

అది పోరంబోకు భూమి కాదు

గంగవరం: మండలంలోని 228, 229, 230 సర్వే నెంబర్లలో ఉన్న పోరంబోకు భూమిని అధికార పార్టీ నేతలు ఆక్రమించుకున్నారన్న వార్త వాస్తవం కాదని, అసలు అది పోరంబోకు కాదని, ఎన్నో సంవత్సరాల నుంచి రైతుల అనుభవంలో ఉందని తహసీల్దార్ అమరనాథ్, వీఆర్వో వినయ్ స్పష్టం చేశారు. ఈ నెల 7వ తేదీన ఒక (సాక్షికాదు) పత్రికలో ప్రచురితమైన పొరంబోకు భూముల ఆక్రమణ వార్తపై మండల అధికారులు విచారణ చేశారు. అందులో ఆ వార్తలో ఉన్న వివరాలన్నీ అవాస్తవమేనని తేల్చారు. ఆ కథనంలో పేర్కొన్న సర్వే నెంబర్ 228లో 0.80 సెంట్లు పక్కా రిజిస్ట్రేషన్ కలిగిన సెటిల్‌మెంట్ భూమి(నంజ) ఉందని చెప్పారు. ఈ భూమిపై మారేడుపల్లి గ్రామానికి చెందిన రైతులు దామోదర్, వెంకటాచలపతి, సుబ్బక్క ముగ్గురూ అనుభవంలో ఉన్నారని వివరించారు. సర్వే నెంబర్ 229లో విస్తీర్ణం 0.72 సెంట్లు, సర్వే నెంబర్ 230లో 0.39 సెంట్లు దరఖాస్తు పట్టా(డి ఫారం) కలిగిన రైతులు సుబ్రమణ్యం, దామోదర్, రత్నమ్మ అనుభవంలో ఉందని చెప్పారు. ఇలా మూడు సర్వే నెంబర్లలోని భూమి మొత్తం రైతుల అనుభవంలో ఉందని ఎక్కడా పోరంబోకు భూమి లేదని వెల్లడించారు. చివరిగా ఈనాడు విలేకరి తనను సంప్రదించకుండానే, తాను వివరణ ఇచ్చినట్లు పత్రికలో ప్రచురించారని తహసీల్దార్ వెల్లడించడం కొసమెరుపు.

హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

చౌడేపల్లె: హత్య కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఎస్‌ఐ రవికుమార్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు, చౌడేపల్లె మండలం వెంగళపల్లె పంచాయతీ పాలెంపల్లెకు చెందిన శ్రీరాములు(52)కు సుమారు 32 యేళ్ల క్రితం పెద్ద బోయకొండమ్మతో వివాహం జరిగింది. అయితే ఇటీవల శ్రీరాములు అతిగా మద్యం తాఇ భార్యను తిట్టడం, కొట్టడం చేసేవాడు. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీ ఆదివారం శ్రీరాములు అతని భార్యను కొడుతూ ఉండగా కేకలు వేసింది. గుర్తించిన శ్రీరాములు తమ్ముడి కుమారుడు విజయ్‌కుమార్, శ్రీరాముని చెల్లెలు శారద, ఆమె భర్త శ్రీనివాసులు కలిసి అడ్డుకోబోయారు. నిత్యం ఇతని చిత్ర హింసలు అధికం కావడంతో శారద, శ్రీనివాసులు కలిసి శ్రీరాములు చేతులు పట్టుకోగా విజయ్‌కుమార్ కత్తితో కడుపు భాగంలో పొడిచి పరారైనట్లు విచారణలో తేలిందన్నారు. గాయపడిన ఆయన్ను తిరుపతికి తరలించగా రుయాలో చికిత్సపొందుతూ ఈనెల 5న మృతి చెందాడు. మృతుని భార్య పెద్ద బోయకొండమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు. కోటూరు వద్ద గల సబ్‌స్టేషన్ వద్ద ముగ్గురిని అరెస్ట్‌చేసి పుంగనూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారని సీఐ పేర్కొన్నారు.


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ రవికుమార్

చోరీకేసులో నిందితుల అరెస్ట్

నగరి : పట్టణంలోని బాలాజీ గోల్డెన్ సిటీలో ఈ ఏడాది ఫిబ్రవరిలో పాలవ్యాపారి జ్ఞానప్రకాష్ తన భార్యతో కలిసి బస్టాండు వద్దగల తన పాలదుకాణానికి వెళ్లాడు. అదే సమయంలో సినీ ఫక్కీలో ఇంటికి ప్రహరీగోడ వైపుగా ఉన్న కిటికీని తొలగించి చొరబడిన దొంగలు ఇంటిలోని బీరువాను పగలగొట్టి డబ్బులు, బంగారం చోరీ చేసుకొని వెళ్లారు. దీనిపై జ్ఞానప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ చోరీ సంఘటనలో దొరికిన ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సోమవారం చోరీకి పాల్పడిన తిరువళ్లూరు జిల్లా వేలప్పన్‌చావడికి చెందిన దొరై (20), ఎగ్మోర్, పుదుపేటకు చెందిన కుమార్ గోపాల్ (22), తిరువేలాంగణికి చెందిన రావిఅజిత్ మోసిస్ (22)ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.18 లక్షల నగదును స్వాధీనం చేసుకొని, కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

హైదరాబాద్ కెళ్లి ఈకేవైసీ చేసిన వలంటీర్

పలమనేరు: వలంటీర్ల సేవలు ఎంత ముఖ్యమైనవో తెలిసేలా ఓ వలంటీర్ హైదరాబాద్‌కెళ్లి సమస్యను పరిష్కరించిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అందిన ఓ బియ్యం కార్డు మార్పు(స్లిప్టింగ్) అర్జీ పరిష్కారం కోసం వలంటీర్ హైదరాబాద్‌కెళ్లి ఈకేవైసీ చేసి సమస్యను పరిష్కరించారు. బైరెడ్డిపల్లి మండలం ధర్మపురికి చెందిన విజయకుమార్ రేషన్‌కార్డులో అతని అన్న హైదరాబాస్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న హరినారాయణ కుటుంబం పేర్లున్నాయి. దీంతో కూలి పనులు చేసుకొనే విజయకుమార్‌కు ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయి. జగనన్న సురక్షలో భాగంగా సంబంధిత సచివాలయంలో విజయకుమార్ రేషన్ కార్డులో మార్పుకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఈ ప్రక్రియ జరగాలంటే హైదరాబాద్‌లోని అతని అన్న కుటుంబం ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఈ విషయం నియోజకవర్గ వలంటీర్ల గ్రూపులో ఉండడంతో స్పందించిన పెద్దపంజాణి మండలం గౌరీనగర్ వలంటీర్ వాసు స్పందించి హైదరాబాద్‌కు వెళ్ళి ఈకేవైసీ చేసి సమస్యను పరిష్కరించారు. ఇంత దూరం వచ్చినందుకు హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ హరినారాయణ వలంటీర్‌కు బస్సు చార్జీలను ఇచ్చి అభినందనలు తెలిపి ఏపీలో జగనన్న పాలనపై మెచ్చుకున్నట్టు వలంటీర్ సంతోషంగా తెలిపాడు.


హైదరాబాద్‌లో హరినారాయణ కుటుంబీకుల నుంచి ఈ కేవైసీ తీసుకుంటున్న వలంటీర్ వాసు

స్పందన వినతులకు ప్రాధాన్యత

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులకు ప్రాధాన్యతనిచ్చి తప్పనిసరిగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జేసీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో నమోదయ్యే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోపు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు. స్పందనకు 303 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్ పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

– అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. అర్హులైన సహాయకులకు ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

– గ్రామాల్లో పనిచేస్తున్న హరిత రాయబారులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య అన్నారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు 20 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు.


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

కల్పవృక్ష వాహనంపై కోదండరాముడు

తవణంపల్లె : టి.పుత్తూరులోని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు కల్పవృక్ష వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం సీతారామ లక్ష్మణులు, ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిపించారు. రాత్రి సర్వాలంకాభూషితుడైన కోదండరామస్వామివారిని కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి కోదండరాములవారికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.



ఎన్నికల విధుల అలసత్వంపై సీరియస్

చిత్తూరు కలెక్టరేట్: పూర్వపు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో ఈ ఏడాది మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించగా.. తిరుపతి జిల్లా కేంద్రంలోని 229, 233 పోలింగ్ స్టేషన్‌లపై పలు అభియోగాలు వచ్చాయి. దీంతో ఆ రెండు పోలింగ్ కేంద్రాల్లో అప్పట్లో రీ పోలింగ్ నిర్వహించారు. ఆ రెండు పోలింగ్ స్టేషన్‌లలో జరిగిన సంఘటనలపై తిరుపతి కలెక్టర్, ఎస్పీలు భారత ఎన్నికల సంఘానికి నివేదికలు పంపారు. ఆ నివేదికల ఆధారంగా పోలింగ్ రోజున విధుల పట్ల అలసత్వం వహించిన పీవో (ప్రిసైడింగ్ ఆఫీసర్లు), రెండు పోలింగ్ కేంద్రాల్లో విధుల్లో పాల్గొన్న ఇతర సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనా ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను అమలు చేసేందుకు తిరుపతి కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

‘పొట్టి గుట్టలు’ కథకు బహుమతి

పుత్తూరు రూరల్: ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ములకనూర్ ప్రజా గ్రంథాలయం వారు నిర్వహించే కథల పోటీల్లో పుత్తూరు రచయిత ఆర్‌సి కృష్ణస్వామిరాజు రచించిన ‘పొట్టిగుట్టలు’ కథకు బహుమతి లభించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ టి.కిషన్‌రావు రచయితకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతిని అందజేశారు. రాయలసీమ మాండలికంలో, చిత్తూరు జిల్లాలో జరిగే జాతర నేపథ్యంలో రాసిన కథకు బహుమతి లభించింది. జాతరలో బలి ఇచ్చే మేకను తప్పించడానికి ఓ పిల్లవాడు చేసే ప్రయత్నం పొట్టి గుట్టలు కథ పాఠకులను విశేషంగా ఆకట్టుకొంది. రచయిత స్వగ్రామం పుత్తూరుకు సమీప గ్రామమైన పొట్టి గుట్టలు గ్రామంలో జరిగిన యథార్థ గాధకు కథా రూపం కల్పించారు. కార్యక్రమంలో ప్రజా గ్రంథాలయం అధ్యక్షులు వంగ రవి, ముఖ్య సలహాదారు వేముల శ్రీనివాసులు, నమస్తే తెలంగాణ పత్రిక ఎడిటర్ టి.కృష్ణమూర్తి, సినీ నటుడు, డైరెక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణస్వామిరాజుకు బహుమతి అందజేస్తున్న వైస్ చాన్సలర్ కిషన్‌రావు

వీఆర్వో సంఘం అధ్యక్షులుగా బాలాజీరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా బాలాజీరెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన బాలాజీరెడ్డి, పుంగనూరుకు చెందిన బాలసుబ్రహ్మణ్యంను సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎన్నికైన బాలాజీరెడ్డిని వీఆర్వోల సంఘం జిల్లా నాయకులు హనుమంతు, పద్మనాభం, మార్కొండ తదితరులు దుశ్శాలువతో సత్కరించారు.


బాలాజీరెడ్డిని సత్కరిస్తున్న జిల్లా వీఆర్వో సంఘం నాయకులు